నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: గ్రీన్‌ల్యాండ్స్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 మధ్యాహ్నం 12 గంటల వరకు వెంకట్‌ప్లాజా, ఒర్రా జ్యువెలర్స్, కృష్ణా జ్యువెలర్స్, ఎక్సైడ్ బ్యాటరీ లేన్, పోచమ్మ బస్తీ, పంజగుట్ట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.15, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 33, క్యాప్సికం 45, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 8, క్యారెట్ 19, దొండ 28, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 55, గోకరకాయ 35, కీర 20, దోసకాయ 18, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 25, చామగడ్డ 35, మొరంగడ్డ 15, కందగడ్డ 75, సొరకాయ 9, పొట్లకాయ 15, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్వోసీ అందజేత



ఎల్వోసీ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని

బన్సీలాల్‌పేట్: అరుణ్‌జ్యోతి కాలనీకి చెందిన భరత్ సతీమణి పావనీ వైద్యం కోసం ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్ కింద ఆర్థిక సాయం మంజూరు చేసింది. దీంతో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సదరు ఎల్వోసీ పత్రాన్ని మంగళవారం బాధితురాలికి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, నాయకులు శివకుమార్, ప్రేమ్, అబ్బాస్, నాగభూషణం పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

పద్మారావునగర్: సంకల్పం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పద్మారావునగర్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు కంటి, దంత, ఇతరత్రా పరీక్షలు చేసి అవసరమున్న వారికి మందులు అందజేశారు. అనంతరం డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ వ్యాయామం, వాకింగ్, యోగా వంటి సాధన చేయాలన్నారు. సామాజిక కార్యకర్తలు లక్ష్మణ్, గోపు రమణ, డాక్టర్ వెంకట్ మందులు సమకూర్చారు. కార్యక్రమంలో సంకల్పం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కల్పన, రజిత, శ్యామల తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

పహల్గాం మృతులకు కొవ్వొత్తులతో నివాళి



సికింద్రాబాద్: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్ర దాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ లష్కర్ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో సీతాఫల్‌మండిలో మంగళవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీతాఫల్‌మండి అంబేడ్కర్ విగ్రహం వద్ద మౌన దీక్ష చేపట్టారు. లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, కార్పొరేటర్ సామల హేమ, వివిధ పార్టీల నాయకులు కుంచాల ఏడు కొండలు, జలందర్ రెడ్డి, ప్రభుగుప్తా, హరి, భాస్కర్ గిరి, శ్రీను, వినోద్, లష్కర్ సాధన సమితి ప్రతినిధులు సాదం బాలరాజ్ యాదవ్, శైలందర్, బాబురావు,కొండల్, అశోక్, శ్రీకాంత్ రెడ్డి, కృష్ణముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



ప్రారంభించిన ఏసీపీ హనుమంతరావు

సనత్‌నగర్: సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో ఎర్రగడ్డలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని బాలానగర్ ఏసీపీ హనుమంతరావు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులుతో కలిసి మంగళవారం ప్రారంభించారు. అనంతరం కొద్దిసేపు బాటసారులకు మంచినీటిని పోసి వారి దాహార్తి తీర్చారు. అలాగే సనత్‌నగర్ పోలీసు సిబ్బందిని అభినందించారు.

ఎట్టకేలకు మరో ఆర్‌యూబీ..!

రూ. 20 కోట్లతో ఆలుగడ్డబావి వద్ద నిర్మాణం



ఈ వంతెన పక్కనే నిర్మించనున్న ఆర్‌యూబీ

- ఉన్నతాధికారుల సందర్శనతో కదలిక
- సంసిద్ధత వ్యక్తం చేసిన రైల్వే శాఖ అధికారులు
- త్వరలోనే పనులు ప్రారంభమయ్యే ఛాన్స్

సికింద్రాబాద్: సికింద్రాబాద్ ప్రాంతానికి మరో ఆర్‌యూబీ అందుబాటులోకి రానున్నది. జీహెచ్ఎంసీ, రైల్వే సంయుక్తాధ్వర్యంలో ఆలుగడ్డబావి వద్ద రోడ్డు అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) నిర్మించనున్నారు. గతంలోనే 2022 జనవరిలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మెట్టుగూడ–చిలకలగూడ చౌరస్తా మార్గంలో ఆలుగడ్డబావి వద్ద ఆర్‌యూబీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి రూ.20 కోట్ల నిధులు మంజూరు చేసింది. అయితే పలు సాంకేతిక సమస్యలు ఎదురవడం, ఆ తర్వాత రెండు ఎన్నికలు రావడంతో పనులు ప్రారంభానికి నోచుకోలేదు.

తాజాగా అధికారులు సందర్శన..

నగరంలో ట్రాఫిక్ సమస్య అధిగమించేందుకు హైలెవల్ జాయింట్ యాక్షన్ కమిటీ పర్యటిస్తున్న విషయం తెలిసిందే. వీరు రహదారుల విస్తీర్ణం, కూడళ్లను ఆధునీకరించడం, బస్‌బేలు ఏర్పాటు చేయడం ద్వారా అటు ప్రయాణికులు, ఇటు వాహనదారులకు ఇబ్బందుల్లేకుండా నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా కొద్దిరోజుల క్రితం జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్, సిటీ ట్రాఫిక్ అదనపు కమిషనర్ తదితర విభాగాల అధికారులు ఆలుగడ్డబావి వద్ద అధ్యాయనం చేశారు. ఇక్కడ ట్రాఫిక్ సమస్య అధిగమించేందుకు ఆర్‌యూబీ నిర్మించాలని నిర్ణయించారు. అనుకున్నదే తడవుగా రైల్వే శాఖ అధికారులకు లేఖలు రాసిన జీహెచ్ఎంసీ అధికారులు వంతెన నిర్మాణానికి మార్గం సుగమం చేసుకున్నారు.

వాహనాలు, రైళ్లకు ఇబ్బంది లేకుండా..

సికింద్రాబాద్‌లో ఒలిఫెంటా, తుకారాంగేట్, రైల్‌నిలయం ఆర్‌యూబీల మాదిరిగా ఆలుగడ్డబావి వద్ద కూడా పుష్ బాక్సు తరహా నిర్మాణం చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. బాక్సును బయటే నిర్మించి రైల్వే ట్రాక్ కింద అమర్చే (పుష్ చేయడం) పద్ధతిలో నిర్మాణం పూర్తి చేయనున్నారు. ఈ ప్రక్రియ ద్వారా రహదారి మీదుగా వాహనాలు, ట్రాక్ మీదుగా రైళ్ల రాకపోకలకు ఇబ్బందుల్లేకుండా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఆర్‌యూబీ పనులను రైల్వే అధికారులు ప్రారంభించగానే.. వంతెనకు సమాంతర రహదారి పనులు చేపట్టేందుకు ఇటు జీహెచ్ఎంసీ అధికారులు సమాయత్తం అవుతున్నారు.

ఆర్‌యూబీతో ప్రయాణం సుగమం..

ఆలుగడ్డబావి ఆర్‌యూబీ అందుబాటులోకి వస్తే ఈ రహదారి ఫోర్‌లేన్‌గా మారనున్నది. దీంతో సికింద్రాబాద్ చిలకలగూడ కూడలి నుంచి మెట్టుగూడ, తార్నాక మీదుగా వివిధ ప్రాంతాలకు వెళ్లే వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు దూరమయ్యే అవకాశాలు ఉన్నాయి. అలాగే రైల్‌నిలయం, మెట్టుగూడ మార్గాల మీదుగా వాహనాల రాకపోకలకు ఆర్‌యూబీలు అనుకూలంగా ఉన్నాయి. చిలకలగూడ కూడలి నుంచి ఆలుగడ్డబావి మీదుగా మెట్టుగూడ వెళ్లేందుకు మాత్రం అక్కడి రైల్వేలైన్ కింద ప్రస్తుతం ఒకటే మార్గం అందుబాటులో ఉంది. ఈ మార్గం పక్కనే మరో మార్గం (ఆర్‌యూబీ) అందుబాటులోకి వస్తే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు మొత్తంగా దూరమయ్యే అవకాశాలు ఉన్నాయి.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న చారకొండ వెంకటేశ్

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పలువురు వక్తలు సూచించారు. ఎస్సీ వర్గీకరణ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యావాదులు తెలుపుతూ ఓయూలో విస్తృత స్థాయి సదస్సు మంగళవారం జరిగింది. ఓయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ గాదె వెంకట్ అధ్యక్షత వహించగా విద్యా కమిషన్ సభ్యుడు డా.చారకొండ వెంకటేశ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణతో కేవలం 20 శాతం మంది చదవుకున్న నిరుద్యోగులే లబ్ధి పొందుతారని మిగితా 80 శాతం మంది ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, సబ్‌ప్లాన్ నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్సీ వర్గీకరణకు కృషిచేసిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఓయూ అధ్యాపకులు ప్రొ.మల్లేశం, డా.మేడి రమణ, డా.వెంకట్ గల్ల వెంకట్, ఓయూ విద్యార్థి నేత వలిగొండ నరసింహ, ఎమ్మార్పీస్ సీనియర్ నాయకులు కృపాకర్ మాదిగ, వర్కింగ్ ప్రెసిడెంట్ డా.నంద్రు నర్సింహరావు మాదిగ, రాష్ట్ర అధ్యక్షులు భైరి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మే డే పోస్టర్ ఆవిష్కరణ

హిమాయత్‌నగర్: తెలంగాణ భవన నిర్మాణ చైతన్య కార్మిక యూనియన్, కార్మిక హక్కుల పోరాట సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన కార్మికుల డిమాండ్స్‌తో కూడిన మే డే వాల్ పోస్టర్‌ను బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో టీయూజేఏసీ ప్రధాన కార్యదర్శి బత్తుల సోమయ్యతో కలిసి సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ భవన నిర్మాణ చైతన్య కార్మిక యూనియన్ ప్రధాన కార్యదర్శి కేసీఎస్ ప్రసాద్, ఇ.బాబు, కార్మిక హక్కుల పోరాట సంఘం అధ్యక్షుడు సురుగు ప్రభాకర్, టీయూజేఏసీ ప్రధాన కార్యదర్శి క్రిష్టొఫర్, సెక్రటరీ జనరల్ తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి, బోగి పద్మ, మార్వాడి సుదీర్ఘన్, టీజేఎఫ్ నాయకులు మోహన్ బైరాగి, జర్నలిస్ట్ ఆంజనేయులు, రచయిత ఇంద్రవెల్లి రమేష్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



డిప్యూటీ మేయర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

లాలాపేట: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మాణికేశ్వర్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాణికేశ్వర్‌నగర్ ప్రధాన రోడ్డులో నూతనంగా డ్రైనేజీ లైన్ నిర్మించాలని అలాగే బస్తీలో సీసీ కెమెరాలు, మాణికేశ్వర్ నగర్ కమాన్‌ను ఎల్ఈడీ లైట్లతో రెనోవేషన్ చేయాలన్నారు. అలాగే బస్తీ కమాన్ పక్కనున్న ఖాళీ స్థలంలో ఒడ్డె ఓబన్న విగ్రహ ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి పర్మిషన్ ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. కలిసిన వారిలో అసోసియేషన్ అధ్యక్షుడు జి. కుమార్, ఉపాధ్యక్షుడు ఏ.మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి బి. ఆంజనేయులు, సంయుక్త కార్యదర్శి హరి, కోశాధికారి పి. శ్రీనివాస్, నరసింహ తదితరులు ఉన్నారు.

బంగారు పుస్తెలతాడు చోరీ

సనత్‌నగర్: బంగారు పుస్తలతాడు చోరీకి గురైన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సనత్‌నగర్ జెక్‌కాలనీ చల్లాఫైడ్ అపార్ట్‌మెంట్‌కు చెందిన అడుసుమిల్లి సాయిశ్రీలేఖ ప్రైవేట్ ఉద్యోగం చేస్తోంది. ఈనెల 28న ఉదయం 10 గంటలకు పెస్ట్ కంట్రోల్ నిమిత్తం ఆనంద్ అనే వ్యక్తి వచ్చాడు. కొద్దిసేపటికి తన పని ముగించుకుని వెళ్లిపోయాడు. సాయంత్రం అల్మారాలోని 4.4 గ్రాముల పుస్తెలతాడు కనిపించలేదు. ఇల్లంతా వెతికినా ప్రయోజనం లేకుండాపోయింది. దీంతో ఉదయం పెస్ట్ కంట్రోల్ కోసం వచ్చిన ఆనంద్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ బాధితురాలు సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేతనాలు చెల్లించాలంటూ ఆస్పత్రి సిబ్బంది ధర్నా

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్–1/12 చౌరస్తాలో ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేస్తున్న హౌస్ కీపింగ్ సిబ్బంది తమకు వేతనాలు చెల్లించాలంటూ మంగళవారం ధర్నా నిర్వహించారు. ఇక్కడ పనిచేస్తున్న సుమారు 200 మంది హౌస్ కీపింగ్ సిబ్బంది ఈ ధర్నాలో పాల్గొని సమస్యలు పరిష్కరించాలంటూ బైఠాయించారు. రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని ఆరోపించారు. హౌస్ కీపింగ్‌గా పనిచేస్తున్న ఓ మహిళ ఆరోగ్యం క్షీణించడంతో ఆమెకు ఈఎస్ఐ లేకపోవడంతో ఇబ్బంది పడుతుండటాన్ని గమనించి తట్టుకోలేక సిబ్బంది అందరం కలిసి చందాలు వేసుకొని ఆమెకు చికిత్స చేయించుకున్నామన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ తప్పనిసరిగా కావాలని డిమాండ్ చేశారు. ఇటీవల వచ్చిన కొంతమంది తమను వేధింపులకు గురిచేస్తున్నారని, కఠినంగా వ్యవహరిస్తున్నారని, జీతాలు అడిగితే ఉద్యోగాల్లో నుంచి తొలగిస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగంలో నుంచి తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న జీతాలను చెల్లించాలని కోరారు.

అందుబాటులోకి వాటర్ క్యాంపు

బేగంపేట ప్రకాశ్‌నగర్ బస్టాప్‌లో ప్రారంభం



వాటర్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న ఎంసీఆర్ చైర్మన్ మర్రి రవీందర్‌రెడ్డి

సనత్‌నగర్: బేగంపేట ప్రధాన రహదారిలోని ప్రకాశ్‌నగర్ వాటర్‌వర్క్ కార్యాలయం ప్రహరీని ఆనుకుని ఏటా వేసవిలో మాజీ సీఎం మర్రి చెన్నారెడ్డి స్మారకార్థం ఏర్పాటుచేసే వాటర్ క్యాంప్ ఈ ఏడాది కూడా అందుబాటులోకి వచ్చింది. కాంగ్రెస్ సీనియర్ నేత షేక్ గౌస్ ఆధ్వర్యంలో వరుసగా 28వ సారి ఏర్పాటు చేయగా, మర్రి చెన్నారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ మర్రి రవీందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై టీపీసీసీ కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమాతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హోసీటోచర్, రాజేందర్, అభిషేక్ అడపా, రమేశ్, అడ్డూ, హనీఫ్, రమాదేవి, ఆబేదా తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తుల మృతి



అడ్డగుట్ట: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈస్ట్‌మారేడుపల్లిలోని రామ్‌సర్ కేఫ్ సమీపంలో మంగళవారం సాయంత్రం 4.30 సమయంలో సుమారు (45) ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. గమనించిన స్థానికులు వెంటనే తుకారాంగేట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ మార్చురీకి తరలించారు. కాగా అనారోగ్యం లేదా వడదెబ్బతో మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

బేగంపేట ప్రధాన రహదారిలో..



సనత్‌నగర్: బేగంపేట ప్రధాన రహదారిలోని ఫుట్‌పాత్‌పై సుమారు 35–40 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ జయచందర్ తెలిపిన వివరాల ప్రకారం..బేగంపేట పీజీ కాలేజ్ సమీపంలో ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పెట్రోలింగ్ సిబ్బంది అక్కడికి చేరుకుని 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. సిబ్బంది వచ్చి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి సంబంధీకులు ఉంటే బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

రైలు ఢీకొని మరొకరు..

సికింద్రాబాద్: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. జీఆర్‌పీ సికింద్రాబాద్ హెడ్ కానిస్టేబుల్ కే.కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో సుమారు 35 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి మౌలాలి రైల్వేస్టేషన్ సమీపంలోని ట్రాక్‌ను దాటుతుండగా వేగంగా వచ్చిన ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా మృతుడి వివరాలు లభించలేదు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఉంటే 8712658581 నంబర్‌లో సంప్రదించాలని రైల్వే పోలీసులు కోరారు.

ప్రభుత్వోద్యోగులకు విరమణ సహజం



అశోక్ కుమార్ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: ప్రభుత్వోద్యోగులకు విరమణ సహజమని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. తిరుమలగిరి మండల తహసీల్దార్ అశోక్ కుమార్ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ కుమార్ దంపతులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్‌నాయక్, సికింద్రాబాద్ ఆర్‌డీఓ సాయిరాం, డీఆర్ఓ వెంకటచారి, ఆర్డీఓ రామకృష్ణ, తహసీల్దార్ పాండు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అధ్యక్షుల సహకారంతోనే ముందుకు



సీఈఓ మధుకర్ నాయక్‌తో సభ్యురాలు నర్మద , బీజేపీ నేతలు

కంటోన్మెంట్: ప్రజా సమస్యల పరిష్కారంలో వార్డు బీజేపీ అధ్యక్షుల సహకారం తీసుకుంటామని బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద అన్నారు. బోర్డు కార్యాయంలోని తన చాంబర్‌లో కంటోన్మెంట్ పరిధిలోని 8 వార్డులు, మోండా డివిజన్ అధ్యక్షుడు, కార్పొరేటర్ కొంతం దీపిక ఇతర సీనియర్ బీజేపీ నేతలతో మంగళవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వార్డు అధ్యక్షులు తమ పరిధిలోని సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే బోర్డు అధికారుల సహకారంతో పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం బోర్డు మాజీ సభ్యుడు రామకృష్ణతో కలిసి వార్డు అధ్యక్షులను సీఈఓ మధుకర్‌నాయక్‌కు పరిచయం చేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు టోపీ శంకర్, విజయానంద్, సతీశ్, ధనుంజయ చారి, బానాల శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ వార్డు అధ్యక్షులు రాకేశ్, శ్రవణ్, అరుణ్, సచిన్, సంతోష్, పవన్, ప్రవీణ్, జితేందర్ పాల్గొన్నారు.

త్రీడి ప్రింటింగ్‌లో ఇంజినీరింగ్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్



పోస్టర్‌ను విడుదల చేస్తున్న వీసీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలోని సెంటర్ ఫర్ ప్రొడక్ట్ డిజైన్ డెవలప్‌మెంట్ అండ్ అడ్డిటివ్ మాన్యూఫ్యాక్చరింగ్ (సీపీడీడీఏఎం) సెంటర్ ఎక్స్‌లెన్స్‌లో త్రీడి ప్రింటింగ్‌లో ఇంజినీరింగ్ విద్యార్థుల నుంచి వేసవిలో ఇంటర్న్‌షిప్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు ఓయూ వీసీ ప్రొ.కుమార్ ఇంటిన్నషిప్ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ ప్రొ.చంద్రశేఖర్, సీపీడీడీఏఎం డైరెక్టర్ ప్రొ.శివరామ కృష్ణతో కలిసి మంగళవారం పోస్టర్ ఆవిష్కరించారు. త్రిడి ప్రింటింగ్ ఇంటర్న్‌షిప్ అన్ని బ్రాంచ్‌లకు చెందిన బీఈ, బీటెక్, ఎంఈ, ఎంటెక్ విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. నాలుగు వారాల బేసిక్ కోర్సు, మూడు నెలల అడ్వాన్స్ కోర్సులో ప్రవేశాలకు వచ్చే నెల 7 లోగా ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అదే నెల 12 నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ



అవగాహన కల్పిస్తున్న నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్రాజు

కంటోన్మెంట్: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు అన్నారు. మారేడిపల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆర్మీ ఆర్డినెన్స్ కార్ప్స్ (ఏఓసీ) సెంటర్‌లో అగ్నివీర్ సిబ్బందికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ట్రాఫిక్ నిబంధనలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధ్యతగల సైనికులు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. హెల్మెట్, లైసెన్స్ లేకుండా, రాంగ్ సైడ్ డ్రైవింగ్ వంటి తప్పులు, వాటికి శిక్షలను వివరించారు. కార్యక్రమంలో సుమారు 300 మంది అగ్నివీర్ సిబ్బంది, లెఫ్టినెంట్ కల్నల్ ఏడీ శర్మ, సబ్ మేజర్ బీఎల్ బార్కర్, మారేడుపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్, ఎస్ఐ శ్రీధర్, వెంకట ప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్థిక వ్యవస్థపై యువత అధ్యయనం చేయాలి

హిమాయత్‌నగర్: ఆర్థిక వ్యవస్థపై నేటి యువత అధ్యయనం చేస్తూ రాష్ట్రం, దేశం ప్రగతి పథంలో నడిచేందుకు కృషి చేయాలని ఓయూ రిజిస్ట్రార్ డాక్టర్ నరేష్‌రెడ్డి అన్నారు. నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ ఆడిటోరియంలో 'ఆదాయ నిర్వహణ సమస్యలు–సవాళ్లు' అనే అంశంపై మంగళవారం నిర్వహించిన జాతీయ సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో దేశానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, పలు రకాలుగా యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు తమ నైపుణ్యాలు పెంచుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్ ప్రతినిధులు ఓబుల్‌రెడ్డి, అప్పారావు, కేశవ్ మెమోరియల్ విద్యాసంస్థల డైరెక్టర్ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ శాంతి తదితరులు పాల్గొన్నారు.

మాణికేశ్వర్‌నగర్‌లో కలుషిత నీటి సరఫరా



లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలోని ఓయూ మాణికేశ్వర్‌నగర్‌లో కొంతకాలంగా కలుషిత తాగునీరు సరఫరా అవుతోంది. బస్తీలోని బెస్త కమ్యూనిటీ హాల్ లైన్ స్ట్రీట్ నంబర్ 14లో జలమండలి అధికారులు ఇటీవలే నూతనంగా నిర్మించిన ఓ ఇంటికి తాగునీటి పైపులైన్ వేశారు. అప్పటి నుంచి దాదాపు 12 రోజులుగా డ్రైనేజీ నీరు కలిసి వస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు. ఈ విషయమై ఇటీవల స్థానికుడు పరమేశ్ జలమండలి అధికారులకు ఫిర్యాదు చేస్తే సిబ్బంది పరిశీలించి వెళ్లారే తప్పా పరిష్కరించలేదని మండిపడ్డారు. దీంతో మంగళవారం సాయంత్రం స్థానికులు కలుషిత నీటితో నిరసన తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్వచ్ఛమైన తాగునీరు అందించాలని వారు కోరుతున్నారు.

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న యువకుడి అరెస్టు

సనత్‌నగర్: క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న యువకుడిని బేగంపేట పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీ మహ్మదీయ మసీదు సమీపంలో ఓ వ్యక్తి ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లుగా పోలీసులకు అందిన సమాచారం మేరకు దాడులు చేయగా నిందితుడు తప్పించుకునేందుకు యత్నించగా పట్టుకున్నారు. బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీకి చెందిన సయ్యద్ వసీం (24)గా గుర్తించి విచారించగా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడినట్లుగా ఒప్పుకున్నాడు. ఇందుకోసం (డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఏపీబుక్.కామ్) అనే అక్రమ వెబ్‌సైట్ ద్వారా బెట్టింగ్‌కు పాల్పడినట్లుగా పోలీసులు నిర్ధారించారు. ఐపీఎల్ ఆన్‌లైన్ ఖాతాలో 73,460 బెట్టింగ్ పాయింట్లు ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి మొబైల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.